## యాదవ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు

**మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ యాదవ్**




**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం భోగారం గ్రామ యాదవ్ సంఘం ఆవరణంలో నిర్వహించిన విగ్నేశ్వరునికి, రామన్నపేట మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమా రమేష్ యాదవ్, ప్రత్యేక పూజా కార్యక్రమాలునిర్వహించారు, ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ వినాయకుని ఆశీర్వాదముతో ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని భక్తి భావం ప్రతి ఒక్కరు పెంపొందించుకోవాలని హితబోధ చేశారు ,ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నవారు గోగు వెంకటరమణ, గోగు యాదయ్య, గోగు సురేష్ యాదవ్ తెలుసూరి నాగేష్, నిరంజన్ పంతులు, కడారి లక్ష్మణ్, మహావీర్ యాదవ్, మేడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చ మల్లయ్య దశదిన కర్మలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



**దశ, యాచారం:** యాచారం మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పచ్చభాష తండ్రి శ్రీ పచ్చ మల్లయ్య దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ) హాజరయ్యారు. ఈ సందర్భంగా పచ్చ మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ కుటుంబానికి ఆదాం సంతోష్ పరామర్శ



**దశ ఓయూ:** మాణిక్యేశ్వరి నగర్‌కు చెందిన కీర్తిశేషులు వేముల శ్రీనివాస్ దశదినకర్మ కార్యక్రమానికి సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదాం సంతోష్‌హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసి, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్‌తో పాటు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## లాలాపేట్‌లో గణనాథునికి బండ కార్తీక చంద్రారెడ్డి పూజలు



**దశ ఓయూ:** భజన సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, హైదరాబాద్ మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపానికి చేరుకున్న ఆమెకు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి హారతి ఇచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు, భజన సమాజ్ సభ్యులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భజన సమాజ్ సలహాదారు రాందాస్, ఎంపీ కృష్ణారావు, ప్రకాష్, లక్ష్మణ్, ప్రమోద్, సాయినాథ్ గౌడ్, మహేందర్ గౌడ్, బిక్షపతి, నాగేష్, రవీంద్ర, కిరణ్, సాయినాథ్, సుదర్శన్, శ్రీనివాస్, హరిశంకర్ తదితరులు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

- *నిజాం నిరంకుశత్వం, దొరలు–భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన కమ్యూనిస్టుల పోరాటం*
- *సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎస్. వీరయ్య*



**దశ, రామన్నపేట:** నిజాం నిరంకుశ పాలనకు, దొరలు-భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణ రైతాంగం సాగించిన మహత్తర సాయుధ పోరాటాన్ని బీజేపీ మతాల మధ్య జరిగిన గొడవగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య అన్నారు.బుధవారం రామన్నపేటలోని మండల కార్యాలయంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటం అనేది మతాల మధ్య జరిగిన ఘర్షణ కాదని, అది నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దోపిడీకి, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా రైతులు, కూలీలు, పేద ప్రజలు సాగించిన వీరోచిత ప్రజా పోరాటమని వీరయ్య పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన ఈ పోరాటంలో వేలాది మంది ప్రజలు, ముఖ్యంగా కమ్యూనిస్టు ఉద్యమ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు.తెలంగాణ సాయుధ పోరాటంలో సుమారు నాలుగు వేల మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం పెరిగిందని, భూస్వామ్య దోపిడీకి సవాల్ ఏర్పడిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, రైతులు, కూలీలు తమ హక్కుల కోసం సంఘటితమై పోరాడిన చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి పాత్ర లేకపోయినా, నేడు ఆ పోరాట చరిత్రను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు మతపరమైన రంగు పులుముతున్నారని విమర్శించారు. చారిత్రక వాస్తవాలను ప్రజలకు తెలియకుండా చేసి, మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.అదేవిధంగా కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ రైతాంగ పోరాటం యొక్క అసలు చరిత్రను ప్రజలకు వివరించకుండా తమ రాజకీయ ప్రయోజనాల కోసం పక్కదారి పట్టిస్తున్నాయని వీరయ్య అన్నారు. తెలంగాణ ప్రజల వీరోచిత పోరాట వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, వాస్తవ చరిత్రను యువతకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కురళ్ళ నర్సింహా చారి, బోయిని ఆనంద్, కందుల హనుమతు, కల్లూరి నగేష్, జంపాల అండాలు, మండల కమిటి సభ్యులు గన్నేబోయిన విజయభాస్కర్, గౌరిగే సోములు,నాగటి ఉపేందర్,ఎండీ రషీద్, గాదె నరేందర్, అవనగంటి నగేష్, తోలుపునూరి శ్రీనివాస్,వేముల సైదులు, మేడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉల్లిగడ్డ రైతులను ఆదుకోవాలి

- *అసెంబ్లీలో ప్రస్తావించిన తాండూర్ ఎమ్మెల్యే*
- *తాండూరులో ఉల్లి బోర్డు ఏర్పాటు చేయాలి*
- *పామాయిల్ సాగు విస్తీర్ణం పెరిగింది*
- *రైతులకు మద్దతు ధర ప్రకటించాలి*

**దశ, తాండూర్ ప్రతినిధి :** అసెంబ్లీలో రైతుల సమస్యలను తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రస్తావించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫాంఆయిల్ రైతులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలి.ఫాంఆయిల్ సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని, ఫాంఆయిల్ పంటకు కనీస మద్దతు ధర నిర్ణయించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఫాంఆయిల్ చెట్లు పెరిగిన అనంతరం వాటిపై నుంచి 11 కేవీ, లీట్ విద్యుత్ లైన్లు వెళ్లే ప్రాంతాల్లో లైన్ షిఫ్టింగ్ అవసరమైనప్పుడు రైతులు ఇబ్బందులు పడకుండా, సరళమైన విధానంలో సమస్యను పరిష్కరించాలని సంబంధిత మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

**ఉల్లిగడ్డ రైతులకు సబ్సిడీ అందించాలి**

తాండూరు నియోజకవర్గ పరిధిలో ఉల్లిగడ్డ సాగు చేసే రైతులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేకంగా సబ్సిడీ అందించి ఆదుకోవాలని అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రిని ఎమ్మెల్యేమనోహర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తాండూర్ పరిసర ప్రాంతంలో ఉల్లిగడ్డ సాగు అత్యధికంగా చేస్తారు అదేవిధంగా తాండూర్లో ఉల్లిపాయను కూడా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం 50,000 ఎకరాలలో తాండూర్ నియోజకవర్గంలో ఉల్లిగడ్డ సాగు చేస్తారు. తాండూర్ నుంచి హైదరాబాద్ లని మలక్పేట్ మార్కెట్ కు రైతులు తరలిస్తారు. కాబట్టి రైతుల యొక్క పంటను తాండూరులోని కొనాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## అప్రకటిత విద్యుత్ కోతలను నివారించి రైతులకు నికరంగా 18 గంటల విద్యుత్ ఇవ్వాలి



- *లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి*
- *రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి*
- *రైతు సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా*

**దశ, రామన్నపేట:** రామన్నపేట మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే నివారించి రైతుల పంటలకు నికరంగా 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సహాయక డివిజనల్ ఇంజనీర్ (ఏడీ) కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య మాట్లాడుతూ మండలంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మరోవైపు లోవోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉండటంతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లోవోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాల్సిన ప్రభుత్వం అప్రకటిత కోతలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని వారు అన్నారు.

“రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం” అని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల పంటలను కాపాడేందుకు నికరంగా 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ కోతలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి, మునిపంపుల సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యుడు వనం ఉపేందర్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బోయిని ఆనంద్, గన్నేబోయిన విజయభాస్కర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ల నర్సింహాచారి, కల్లూరి నగేష్, జంపాల అండాలు, మండల నాయకులు నాగటి ఉపేందర్, నీల అయిలయ్య, ఎండీ రషీద్, గాదె నరేందర్, వేముల సైదులు, అవనగంటి నగేష్, మునికుంట్ల లెనిన్, శానగొండ రాము, తాళ్లపల్లి జితేందర్, అంబటి సురేందర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, బాణాల నవీన్ రెడ్డి, దేవరపల్లి బిక్షం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెత్త వేస్తే పూలదండే... ఆపై ₹500 ఫైన్!

- *వినూత్న రీతిలో చౌటుప్పల్ మున్సిపల్ అధికారుల చర్యలు*
- *రోడ్డుపై చెత్త వేస్తూ పట్టుబడిన నలుగురికి గాంధీగిరి.. జరిమానా*




**దశ, చౌటుప్పల్:** రోడ్డు పక్కన చెత్త వేస్తున్న వారికి చౌటుప్పల్ మున్సిపల్ అధికారులు వినూత్న రీతిలో బుద్ధి చెప్పారు. చెత్త వేస్తూ పట్టుబడిన వారికి పూలదండలు వేసి ‘గాంధీగిరి’ పద్ధతిలో పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించారు. నేషనల్ హైవే 65లోని వలిగొండ జంక్షన్ నుంచి లింగోజిగూడెం వెళ్లే రహదారి పక్కన కొందరు నిబంధనలకు విరుద్ధంగా చెత్త వేస్తున్నారన్న సమాచారంతో మున్సిపల్ సిబ్బంది బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుపై చెత్త వేస్తూ నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. చెత్త వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులు వారికి వివరించారు. ఇకపై రోడ్డు పక్కన చెత్త వేయకుండా, మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహనాలకే చెత్తను అందించాలని సూచించారు. రోజూ మూడు షిఫ్టుల్లో విధులకు వెళ్లే కొంతమంది వ్యక్తులు మార్గమధ్యంలో చెత్తను రోడ్డుపక్కన పడేస్తున్నారని అధికారులు తెలిపారు. దీంతో వారానికొకసారి సిబ్బంది పెద్దఎత్తున అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించాల్సి వస్తోందన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, జవాన్ అంజయ్యతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## హయత్‌నగర్ పాఠశాలల్లో జిల్లా విద్యాధికారి తనిఖీ

**దశ, హయత్‌నగర్:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హయత్‌నగర్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హయత్‌నగర్‌ను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులను యాప్ ద్వారా ప్రశ్నలు అడిగి వారి సమాధానాలను, పేర్లతో సహా నమోదు చేశారు. అనంతరం పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. వర్క్‌బుక్స్‌ను ఎప్పటికప్పుడు సరిదిద్ది, సంతకం చేసి తేదీ నమోదు చేయాలని తెలిపారు. పాఠశాలల్లో బోధనకు IFP ప్యానెల్‌ను వినియోగించాలని, ప్రాథమిక పాఠశాలలో FLNను అభివృద్ధి చేయాలని, ఉన్నత పాఠశాలలో LIPను మెరుగుపరచాలని జిల్లా విద్యాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రజిని, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గణనాథుల గంగమ్మ ఒడికి పయనం!





- ఇనాం గూడా చెరువులో మొదలైన గణేష్ నిమజ్జనాలు.. క్రేన్లతో వరుసగా నిమజ్జనాలు
- భక్తుల కోలాహలం.. పోలీస్, వైద్య, పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో గణేష్ నిమజ్జనాల సందడి మొదలైంది. మండపాల్లో కొలువుదీరిన గణనాథులను భక్తులు భారీ ఊరేగింపులతో ఇనాం గూడా చెరువు వద్దకు తరలిస్తూ నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. డప్పులు, నృత్యాలు, భక్తుల నినాదాలతో చెరువు పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.

నిమజ్జనాల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెరువు వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్ల సహాయంతో గణేష్ విగ్రహాలను ఎప్పటికప్పుడు సురక్షితంగా నీటిలోకి తరలిస్తున్నారు. విగ్రహాల సంఖ్యకు అనుగుణంగా నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేలా సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

నిమజ్జన ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింది. భక్తుల రాకపోకలను పర్యవేక్షిస్తూ అవసరమైన చోట సిబ్బందిని మోహరించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో సేవలు అందిస్తున్నారు.

గణనాథులను నిమజ్జనం చేసిన అనంతరం భక్తులు ఉత్సాహంగా సంబరాలు చేసుకుంటున్నారు. యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిమజ్జన వేడుకల్లో పాల్గొంటుండగా, చెరువు పరిసరాల్లో సందడి నెలకొంది. కుటుంబ సభ్యులు, యువత సెల్ఫీలు దిగుతూ పండుగ వేడుకలను ఆస్వాదిస్తున్నారు.

నిమజ్జనాల సందర్భంగా చెరువు పరిసరాల్లో భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి తొందరపాటు లేకుండా క్రమపద్ధతిలో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకోవాలని, పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. మొత్తంగా ఇనాం కూడ చెరువు వద్ద గణనాథుల నిమజ్జనాలతో ఆ ప్రాంతమంతా భక్తి, ఉత్సాహంతో కళకళలాడుతోంది.

# మహిళల స్వావలంబనకు ఐటీసీ బంధన్ చేయూత

- మహిళలకు స్వయం ఉపాధిపై అవగాహన




**దశ, బూర్గంపాడు:** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఐటీసీ బంధన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమెన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా బుధవారం బంజారా బజార్‌లో రిఫ్రెషర్ ట్రైనింగ్, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎం మేసాల హేమంతిని హాజరై మహిళా లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీఎం హేమంతిని మాట్లాడుతూ.. మహిళలు తమకు అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తూ చిన్న వ్యాపారాలు, ఇతర ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వయం ఉపాధి, ఆదాయ మార్గాలు, చిన్న వ్యాపారాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ ద్వారా ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలపై స్పష్టత ఏర్పడుతోందని మహిళలు తెలిపారు. మహిళలను ఆర్థిక స్వావలంబన వైపు నడిపించేలా శిక్షణ ఇవ్వడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ భూక్య కుమార్, ఏసీ ఉత్తమ్, మార్జిట్, ఏడీఎస్సీ సభ్యుడు పండగ రాములు, సీసీ సుజాతతో పాటు బంజారా పరిధికి చెందిన 25 మంది మహిళా లబ్ధిదారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# కొల్లు చెరువులో లక్ష చేప పిల్లల విడుదల



**దశ, బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలోని కొల్లు చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్య సహకార సంఘం సభ్యులు లక్ష చేప పిల్లలను విడుదల చేశారు. ఇందులో బొచ్చ, గడ్డి రకానికి చెందిన చేప పిల్లలను చెరువులో వదిలినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. చెరువుల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహించడం, మత్స్యకారులకు స్థిరమైన ఉపాధి కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడటమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. చేప పిల్లలు సహజసిద్ధంగా పెరిగేలా చెరువు వాతావరణాన్ని కాపాడుకోవాలని, పెంపకం విషయంలో మత్స్యకారులు తగిన నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘం సభ్యులు మాట్లాడుతూ.. కొల్లు చెరువులో చేపల సంరక్షణ కోసం గాలాలు వేసి చేపలు పట్టడాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా చేపలు పట్టే వారిపై కఠిన చర్యలతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. చెరువులో విడుదల చేసిన చేప పిల్లలను కాపాడేందుకు స్థానికులు, మత్స్యకారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# ఇల్లెందు ప్రైవేట్ ఆసుపత్రులపై మెరుపు తనిఖీలు


- రికార్డులు, అనుమతుల్లో లోపాలు గుర్తింపు

**దశ, ఇల్లందు:** ఇల్లెందు మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లలో నిబంధనల ఉల్లంఘనలపై వైద్యారోగ్య శాఖ కొరడా ఝుళిపించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు బుధవారం ఇల్లెందులోని పలు ప్రైవేట్ వైద్యశాలలు, ల్యాబ్‌లపై ప్రత్యేక అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రామదాస్, పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ నేతృత్వంలోని బృందం ఈ తనిఖీలు చేపట్టింది.

తనిఖీల్లో భాగంగా ఆసుపత్రులు, స్కానింగ్ మరియు డయాగ్నొస్టిక్ సెంటర్ల రిజిస్ట్రేషన్ పత్రాలు, రెన్యూవల్ వివరాలు, అర్హత కలిగిన ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్యుల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా సరైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఒక డయాగ్నొస్టిక్ సెంటర్‌ను అధికారులు అక్కడికక్కడే సీజ్ చేశారు. నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామదాస్, డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ..ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఏ ప్రైవేట్ సంస్థనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు పొంది, చట్టబద్ధ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా నడిపితే క్రిమినల్ చర్యలు, సీజింగ్ తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిస్తా: ప్రణవ్





- ఘనంగా వొడితల రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు

**దశ, హుజురాబాద్ :** హుజురాబాద్ అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ రాజేశ్వర్ రావు అని వారు చేసిన పనులే ఇప్పటికీ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని,వారు చూపిన బాటలో నడుస్తూ ప్రజలకు మరింత సేవ అందజేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.బుధవారం రోజున మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితల రాజేశ్వర్ రావు జయంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకల్లో పలువురు ఆయన అభిమానులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాజేశ్వరరావు వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ ప్రాంతానికి పెద్దదిక్కుగా ఇక్కడి అవసరాలకు తగ్గట్టుగా పలు అభివృద్ధి పనులు చేశారని,ఆయన దూరదృష్టి వల్ల ఆ సేవలు ఇప్పటితరానికి కూడా ఉపయోగపడుతున్నాయని అన్నారు.అనంతరం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు, అధికార ప్రతినిధులు,అన్ని మండల,పట్టణ అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాలు,ప్రజా ప్రతినిధులు,బ్లాక్ కాంగ్రెస్,ఎస్సీ సెల్,బీసీ సెల్,మైనారిటీ,సేవాదళ్, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవస్థానం భూముల్లో అక్రమ నిర్మాణాలపై కొరడా!

- 25వ తేదీలోగా ఆక్రమణలు తొలగించాలని సూచన



**దశ భద్రాచలం:** పురుషోత్తమపట్నం దేవస్థానానికి సంబంధించిన భూముల్లో అక్రమంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టారు. దేవస్థానం భూముల్లో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తించిన నేపథ్యంలో దేవస్థానం ఈవో ఆధ్వర్యంలో దేవస్థాన సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి నిర్మాణాలను పరిశీలించారు.అక్కడ ఇళ్లు నిర్మించుకున్నవారికి దేవస్థాన భూములకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ, అక్రమ నిర్మాణాలను తొలగించుకోవాలని సూచించారు. అధికారులు వివరాలు తెలియజేయడంతో పలువురు నిర్మాణదారులు స్పందించి తమ ఇళ్లను, నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకున్నట్లు తెలిసింది. అయితే మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయినప్పటికీ ఆయా ఇళ్లలో ఎవరూ నివాసం ఉండకుండా ఖాళీగా ఉండటాన్ని అధికారులు గుర్తించారు. దీంతో ఎటపాక పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది సమక్షంలో దేవస్థానం సిబ్బంది కలిసి ఖాళీగా ఉన్న కొన్ని నిర్మాణాలను తొలగించే చర్యలు చేపట్టారు.

ఇదిలా ఉండగా,మిగిలిన ఇళ్లలో ఉన్నవారు తమ ఇళ్లను తామే తొలగించుకునేందుకు కొంత సమయం ఇవ్వాలని అధికారులను కోరినట్లు సమాచారం. వారి విజ్ఞప్తిపై స్పందించిన ఎటపాక పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది ఈ నెల 25వ తేదీలోగా తమ ఇళ్లను, నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలను స్వయంగా తొలగించుకోని పక్షంలో, సంబంధిత శాఖల అధికారులు పోలీసుల సహకారంతో అక్కడికి వచ్చి నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సి వస్తుందని ఆక్రమణదారులకు తెలియజేసినట్లు సమాచారం. దీంతో పురుషోత్తమపట్నం దేవస్థానం భూముల్లో అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియపై స్థానికంగా చర్చ జరుగుతోంది. దేవస్థానానికి సంబంధించిన భూములు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించేందుకు అధికారులు చేపడుతున్న చర్యల్లో భాగంగానే ఈ తొలగింపు ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

- వాస్తవాలను నేటి తరానికి తెలియజేయాలి: సీపీఐ నేత విఎస్. బోస్



**దశ ఓయూ:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను మతపరమైన కోణంలోకి వక్రీకరించడం, కమ్యూనిస్టుల పాత్రను విస్మరించడం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విఎస్. బోస్ అన్నారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అక్రమ పన్నులకు వ్యతిరేకంగా 1946-51 మధ్య సాగిన తెలంగాణ రైతాంగ పోరాటం ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో సీపీఐ, ఏఐవైఎఫ్ ఉప్పల్ నియోజకవర్గ సమితుల ఆధ్వర్యంలో 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర-వక్రీకరణ-వాస్తవాలు' అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూమ్ మొహియుద్దీన్, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం తదితర కమ్యూనిస్టు నాయకులు పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దొడ్డి కొమురయ్య అమరత్వం ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. రైతుల భూములపై హక్కులు, వెట్టిచాకిరీ నిర్మూలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై పోరాడారని చెప్పారు.

రైతాంగ సాయుధ పోరాటాన్ని కేవలం మతపరమైన ఘర్షణగా చూపడం చరిత్రకు అన్యాయమని బోస్ అన్నారు. రజాకార్ల దాడులు, నిజాం పాలనలోని అణచివేతలను చరిత్రలో నమోదు చేయడంతో పాటు ఉద్యమం సాగిన సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని కూడా ప్రజలకు తెలియజేయాలని కోరారు. కె.ఎల్. మహేంద్ర తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమంలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో పార్టీ నిర్మాణం, కార్మిక సంఘాల అభివృద్ధిలో కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. చరిత్రను ఆధారాలతో అధ్యయనం చేసి వాస్తవాలను భవిష్యత్ తరాలకు అందించాలని విద్యార్థులు, యువతను కోరారు.

కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి తోకల సత్యప్రసాద్, సీపీఐ ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి ఎం.డి. బషీర్ అలీ, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల సమితి కార్యదర్శి జి. మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రిషిత, ఈ. సతీష్‌కుమార్, గిరిబాబు, ఎం. చంద్రశేఖర్, సీపీఐ సీనియర్ నాయకుడు రామ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.